క్లుప్తంగా

వాలీబాల్ కిట్ పంపిణీ



కిట్ అందజేస్తున్న బీఆర్ఎస్ నాయకులు

పెంచికల్‌పేట్: మండలంలోని చేడ్వాయి గ్రామ పంచాయతీ పరిధిలోని గుట్టలవాడ వాలీబాల్ క్రీడాకారులకు మంగళవారం బీఆర్ఎస్ నాయకుడు చౌదరి శ్రీనివాస్ వాలీబాల్ కిట్ అందజేశారు. ఆయన మాట్లాడుతూ యువకులు ఖాళీ సమయాల్లో ఆటలపై దృష్టిపెట్టాలన్నారు. ఆటలతో మానసిక ఉల్లాసం కలుగుతుందన్నారు. నాయకులు ఎస్‌కే బాబు, చౌదరి సత్తన్న, బోయిరే జై, బుజాడి వెంకటేష్, సత్యన్న, అనిల్, రాజు, ఆశన్న, యువకులు పాల్గొన్నారు.

'కంటి వెలుగు' కేంద్రం పరిశీలన



పరీక్షలను పరిశీలిస్తున్న ఎంపీపీ విమలాబాయి

వాంకిడి: మండలంలోని సమేల గ్రామంలో ఏర్పాటు చేసిన కంటి వెలుగు కేంద్రాన్ని ఎంపీపీ ముండె విమలాబాయి మంగళవారం సందర్శించారు. కేంద్రాన్ని పరిశీలించి, కంటి పరీక్షలకు వచ్చే వారు అసౌకర్యానికి గురి కాకుండా చూసుకోవాలని సిబ్బందికి సూచించారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన కంటి వెలుగు కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ మారుతి, బీఆర్ఎస్ నాయకుడు దీపక్ ముండె తదితరులు పాల్గొన్నారు.

గ్రామీణ యువత ఉద్యోగాలు సాధించాలి



యువకుడిని అభినందిస్తున్న ఉపాధ్యాయులు

కౌటాల: గ్రామీణ యువత ఉద్యోగాలు సాధించాలని హెచ్ఎం జి.హన్మంతు అన్నారు. మండలంలోని గుండాయిపేట గ్రామానికి చెందిన యువకుడు భోజ్‌నాజ్ ఆర్మీ జవాన్‌గా ఉద్యోగం సాధించడంతో మంగళవారం స్థానిక జెడ్పీ పాఠశాలలో యువకుడిని ఉపాధ్యాయులు అభినందించారు. హెచ్ఎం మాట్లాడుతూ గ్రామీణ యువకులు ఉన్నత చదువులు చదవాలన్నారు. విద్యార్థులు చదువుతో పాటు అన్ని రంగాల్లో ముందుండాలని తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు రాకేష్ గుప్తా, శ్యామ్‌సుందర్ తదితరులు పాల్గొన్నారు.

రికార్డులు నమోదు చేయాలి



బోధన పరిశీలిస్తున్న రమేశ్

కెరమెరి: అన్ని రకాల రికార్డులను నమోదు చేయాలని గోయగాం, కెరమెరి స్కూల్ కాంప్లెక్స్ హెచ్ఎంలు నల్లగొండ రమేశ్, ఆడే ప్రకాశ్ అన్నారు. మంగళవారం నిసాని, ఉమ్రి, ఇందాపూర్, కెలి(కె), నారాయణగూడ పాఠశాలలను సందర్శించారు. రికార్డులు పరిశీలించారు. తొలిమెట్టులో భాగంగా తరగతి బోధనను పరిశీలించారు.

విద్యార్థులకు రాగిజావ పంపిణీ

కాగజ్‌నగర్‌టౌన్: శ్రీ సత్యసాయి అన్నపూర్ణ ట్రస్ట్ ఆధ్వర్యంలో కాగజ్‌నగర్ పట్టణంలోని వార్డు నం.14లో గల ప్రభుత్వ ప్రాథమికోన్నత పాఠశాలలో రాగి జావ పంపిణీ కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా 250 మంది విద్యార్థులకు రాగి జావ అందించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు వేణుగోపాల్ రావు, కాంప్లెక్స్ హెచ్ఎం నజీర్, ట్రస్ట్ సభ్యులు మల్లేశం, లక్ష్మణ్, మురళి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

రైతులను మోసగించిన దళారి

కెరమెరి: పత్తి తూకంలో మోసం చేస్తూ మహారాష్ట్రకు చెందిన దళారి మంగళవారం పట్టుబడ్డాడు. గోయగాంలో రైతుల వద్ద నుంచి కంప్యూటరైజ్ కాంటాపై పత్తి తూకం వేసి కొనుగోలు చేశాడు. తూకంపై అనుమానం వచ్చిన రైతులు మార్కెట్ అధికారులకు సమాచారం అందించారు. అధికారులు కాంటాతో పత్తి పంట తూకం వేయగా వ్యత్యాసం వచ్చింది. దీంతో రైతులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. అయితే తమకు ఎలాంటి ఫిర్యాదు అందలేదని పోలీసులు తెలిపారు.

'నిసాని' దారి కష్టాలు..!

- ఏళ్లుగా ఇబ్బందులు
- పట్టించుకోని అధికారులు



అటవీ అనుమతులు లేక పనులు నిలిపివేసిన రోడ్డు



రాళ్లు తేలి నడిచేందుకు యోగ్యంగా లేని రోడ్డు

కెరమెరి: మండలంలోని నిసాని గ్రామ ప్రజలు రోడ్డు లేక నానా అవస్థలు పడుతున్నారు. కెరమెరి మండల కేంద్రం నుంచి పునరావాస కాలనీ దేవుడ్‌పల్లి వరకు గుత్తేదారు రోడ్డు నిర్మించి వదిలేశారు. అక్కడి నుంచి రెండు కిలోమీటర్ల దూరంలో ఉన్న నిసాని గ్రామానికి రోడ్డు వేయకపోవడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు.

రోడ్డుపై రాళ్లు, రప్పలు..

నిసాని గ్రామపంచాయతీలో సుమారు 420 కుటుంబాలు, 1234 జనాభా ఉంది. నిసాని జీపీ పరిధిలో గోండ్‌గూడ, బారేగుడ, పర్‌ధాన్‌గూడ, బెస్తగూడ గ్రామాలు ఉన్నాయి. కుమురం భీం ప్రాజెక్టులో ముంపునకు గురైన గ్రామం ఇది. కెరమెరి నుంచి నిసానికి వెళ్లాలంటే ఉమ్రి, ఇందాపూర్ మీదుగా వెళ్లాల్సి ఉంటుంది. దేవుడ్‌పల్లి గ్రామస్తులకు నిసానికి వెళ్లేదారి సమీపంలో పునరావాసం కల్పించారు. పునరావాసం కాలనీ వరకు సదరు గుత్తేదారు బీటీ రోడ్డు వేసినప్పటికీ మిగిలిన రెండు కిలోమీటర్ల రోడ్డు అధ్వానంగా ఉంది. రోడ్డుపై రాళ్లు, రప్పలు తేలి నడిచేందుకు కూడా యోగ్యంగా లేదు. వానాకాలంలో రోడ్డు పూర్తిగా బురదమయంగా మారి రాకపోకలు నిలిచిపోతున్నాయి. దీంతో ఆయా గ్రామాల ప్రజలు ఆసిఫాబాద్ మీదుగా 50 కిలోమీటర్లు తిరిగి కెరమెరికి రావాల్సిన పరిస్థితి నెలకొంటుంది.

అటవీ అనుమతులు లేక..

కెరమెరి నుంచి దేవుడుపల్లి వేసిన రోడ్డు మార్గంలో అగుర్‌వాడ గ్రామం నుంచి ఉమ్రి వరకు రోడ్డు పనులు నిలిపివేశారు. ఫారెస్ట్ క్లియరెన్స్ లేకపోవడంతో అధికారులు పనులు ఆపేశారు. అప్పటి నుంచి ఇప్పటి వరకు దాని గురించి పట్టించుకునే నాథుడు లేకపోయాడు. వానాకాలంలో రోడ్డు మరింత అధ్వానంగా మారుతుండడంతో పాదచారులతో పాటు వాహనాలు సైతం వెళ్లని పరిస్థితి నెలకొంది. అధికారులు స్పందించి రోడ్ల నిర్మాణానికి చర్యలు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.

నడక కూడా కష్టం



ఏదైనా పని నిమిత్తం కెరమెరికి వెళ్లాల్సి వస్తే నరకం కన్పిస్తుంది. నిసాని నుంచి దేవుడ్‌పల్లి పునరావాస కేంద్రం వరకు బండలు, కంకర తేలిన రోడ్డు కనీసం నడిచేందుకు కూడా యోగ్యంగా లేదు. అలాగే ఆగుర్‌వాడ నుంచి ఉమ్రి వరకు ఉన్న రోడ్డుకు అటవీ అనుమతులు లేక కష్టమవుతుంది.

\- శంకర్, నిసాని గ్రామస్తుడు

గ్రామ సింహాలకు వింత వ్యాధి

- ఊడిపోతున్న వెంట్రుకలు
- వికారంగా కనిపిస్తున్న శునకాలు
- అందుబాటులో మందులు



మేంజ్ వ్యాధి సోకిన శునకాలు

దహెగాం: గ్రామానికి, ఇంటికి కాపలా ఉండే గ్రామ సింహాలకు వింత వ్యాధి సోకుతోంది. ఎక్కడ చూసినా శునకాలు వ్యాధి బారిన పడి వికారంగా కనిపిస్తున్నాయి. కుక్కలకు ఎలాంటి చికిత్స అందించకపోవడంతో మృత్యువాత పడుతున్నాయి. మండల కేంద్రంతో పాటు ఆయా గ్రామాల్లోని శునకాలు వింత వ్యాధి బారినపడ్డాయి. ఈ వ్యాధి ఒక కుక్క నుంచి మరో కుక్కకు వ్యాపిస్తుందని, ఇది మేంజ్ అనే అంటువ్యాధి అని పశువైద్యాధికారులు పేర్కొంటున్నారు. వ్యాధి రాకుండా చికిత్స అందుబాటులో ఉందని, ఇందుకు ఒక్కో కుక్కకు రూ. 2వేల వరకు ఖర్చవుతుందని తెలిపారు.

తీసుకోవాల్సిన చర్యలు..

మేంజ్ అనే వ్యాధి సోకిన శునకాలను ప్రతి రెండు రోజులకు ఒకసారి శుభ్రంగా నీటితో కడగాలి. పశు వైద్యశాలలో దీనికి సంబంధించిన చికిత్స అందుబాటులో ఉందని, వ్యాధి సోకిన శునకాలకు ఆయింట్‌మెంట్ రాయాలని అధికారులు సూచిస్తున్నారు. కాగా వ్యాధి సోకిన కుక్కలకు చికిత్స అందించడం పెద్ద సవాల్‌గా మారింది. గ్రామ పంచాయతీ అధికారులు, సిబ్బంది పాలకవర్గం కృషి చేసి శునకాలను పట్టుకుని చికిత్స అందించాలని స్థానికులు కోరుతున్నారు. చికిత్స అందించిన తర్వాత వ్యాధి నయం కావడానికి సుమారు రెండు నెలల సమయం పడుతుందని వైద్యులు పేర్కొంటున్నారు.

మందులు అందుబాటులో ఉన్నాయి

కుక్కలకు సోకిన మేంజ్ అనే వ్యాధికి పశువైద్యశాలలో మందులు అందుబాటులో ఉన్నాయి. అంటువ్యాధి సోకకుండా పెంపుడు కుక్కలు పెంచే వారు జాగ్రత్తలు తీసుకోవాలి. వ్యాధి సోకిన శునకాలకు చికిత్స అందిస్తే రెండు నెలల్లో వ్యాధి నయమవుతుంది.

\- శ్రావణ్ కుమార్, పశువైద్యాధికారి, దహెగాం

అర్హులకు ఆసరా పింఛన్లు అందించాలి

కాగజ్‌నగర్‌టౌన్: అర్హులైన వారికి తక్షణమే ఆసరా పింఛన్లు మంజూరు చేసి, ఆర్థిక సాయం అందేలా చూడాలని సీపీఐ ఎంఎల్ రెడ్‌స్టార్ జిల్లా కార్యదర్శి గోగర్ల తిరుపతి డిమాండ్ చేశారు. మంగళవారం కాగజ్‌నగర్ మున్సిపల్ కార్యాలయం ఎదుట విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. వితంతువులు పింఛన్ కోసం కార్యాలయాల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారని, డెత్ సర్టిఫికెట్ అందజేసిన వెంటనే పింఛన్ మంజూరు చేసే విధానాన్ని పకడ్బందీగా అమలు చేయాలని కోరారు.

దూడలకు టీకాలు వేయించాలి

కౌటాల: పశువుల దూడలకు రైతులు టీకాలు వేయించాలని మండల పశువైద్యాధికారి ఎస్. శ్రీకాంత్ అన్నారు. కౌటాల పశువైద్యశాల ఆధ్వర్యంలో మంగళవారం మండలంలోని వీరవెల్లి గ్రామంలో దూడలకు బ్రూసెల్లోసిస్ వ్యాధి నివారణ టీకాలు వేశారు. ఆయన మాట్లాడుతూ దూడలకు టీకాలు వేస్తే గర్భకోశ వ్యాధులు రావన్నారు. 4 నుంచి 8 నెలల వయస్సు గల ఆవు, గేదె దూడలకు టీకాలు వేస్తున్నట్లు తెలిపారు. నాయకులు వినోద్, సిబ్బంది సందీప్, రాజన్న, భిక్షపతి, తదితరులు పాల్గొన్నారు.

పశువులకు టీకాలు

పెంచికల్‌పేట్: మండలంలోని గొంట్లపేట్ గ్రామంలో పశువుల్లో వచ్చే బ్రూసెల్లోస్ వ్యాధిని నివారించడానికి పశువైద్యాధికారి డా.రాకేష్ ఆధ్వర్యంలో మంగళవారం ఆవు, గేదె దూడలకు టీకాలు వేశారు. కార్యక్రమంలో సర్పంచ్ దాసరి చంద్రమౌళి, సిబ్బంది సురేష్, శివ, రైతులు పాల్గొన్నారు.



పెంచికల్‌పేట్: టీకా వేస్తున్న వైద్యసిబ్బంది

జాతీయస్థాయి పోటీలకు విద్యార్థుల ఎంపిక



ఎంపికైన అరుణ్‌తో పీఈటీ, ట్రైబల్ వెల్ఫేర్ ఆఫీసర్



తిర్యాణి: ఎంపికైన విద్యార్థులతో ఉపాధ్యాయులు

కాగజ్‌నగర్‌టౌన్: ఈనెల 10 నుంచి 12వ తేదీ వరకు పాట్నాలో జరిగే జాతీయస్థాయి అథ్లెటిక్స్ పోటీలకు మహాత్మ జ్యోతిబాపూలే (చిన్నరాస్పల్లి) పాఠశాలలో 8వ తరగతి చదువుతున్న ఆర్. అరుణ్ ఎంపికైనట్లు పాఠశాల పీఈటీ సురేష్ రాథోడ్ మంగళవారం తెలిపారు. జాతీయస్థాయి అథ్లెటిక్ పోటీలకు పాఠశాలకు చెందిన విద్యార్థి ఎంపిక కావడం గర్వకారణమన్నారు. కాగజ్‌నగర్ అసిస్టెంట్ ట్రైబల్ వెల్ఫేర్ ఆఫీసర్ జుబేర్, ప్రిన్సిపాల్ మంగలు ఎంపికపై హర్షం వ్యక్తం చేశారు.

ఆశ్రమ పాఠశాల విద్యార్థుల ఎంపిక

తిర్యాణి: ఈనెల 10 నుంచి 12 తేదీ వరకు పాట్నాలో జరిగే 18వ జాతీయ స్థాయి జూనియర్ అథ్లెటిక్స్ పోటీలకు మండలంలోని పంగిడిమాదర ఆశ్రమ పాఠశాలకు చెందిన విశ్వనాథ్, భూంరావ్, నాగేశ్వర్ అనే ముగ్గురు విద్యార్థులు ఎంపికైనట్లు పాఠశాల పీడీ గుండం లక్ష్మణ్ తెలిపారు. ఈ సందర్భంగా ఎంపికైనా విద్యార్థులకు పాఠశాల ప్రధానోపాధ్యాయుడు గోపాల్ స్పోర్ట్స్ కిట్ అందజేశారు.

తేనె శుద్ధి కేంద్రం పరిశీలన

వాంకిడి: మండల కేంద్రంలోని మండల సమాఖ్య ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న తేనె శుద్ధి కేంద్రాన్ని డీఆర్డీవో సురేందర్, సివిల్ సప్లయ్ డీఎం మంగళవారం సందర్శించారు. తేనె సేకరణ, శుద్ధి చేసే విధానం పరిశీలించారు. శుద్ధి చేసిన తేనె మార్కెటింగ్ వివరాలను ఏపీఎం మహేష్‌ను అడిగి తెలుసుకున్నారు. వాంకిడి మండలంలోనే కాకుండా జిల్లాలోని వివిధ మండలాల్లో విక్రయం జరిగేలా కార్యక్రమాలు చేపట్టాలని సూచించారు. అనంతరం శుద్ధి చేసిన 2 కిలోల తేనెను కొనుగోలు చేశారు.



తేనె శుద్ధి కేంద్రాన్ని పరిశీలిస్తున్న అధికారులు

అక్రమ కట్టడాలు నిలిపివేయాలి

బెజ్జూర్: ప్రభుత్వ భూముల్లో అక్రమ కట్టడాలు నిలిపివేయాలని తహసీల్దార్ శ్రీపాల్ రెడ్డి అన్నారు. మండల కేంద్రంలోని ప్రభుత్వ భూముల్లో నూతనంగా నిర్మిస్తున్న పలు అక్రమ కట్టడాలను సందర్శించారు. అక్రమ నిర్మాణాలను నిలిపివేయాలని ఉన్నతాధికారుల నుంచి ఆదేశాలు రావడంతో ఆయన మంగళవారం పరిశీలించారు. ప్రభుత్వ భూముల్లో ఎలాంటి అక్రమ కట్టడాలు చేపట్టవద్దని హెచ్చరించారు.



అక్రమ నిర్మాణాలు పరిశీలిస్తున్న తహసీల్దార్

పోడు సాగుదారులకు హక్కు పత్రాలివ్వాలి

భీమిని: పోడు భూమి సాగుదారులకు హక్కు పత్రాలు ఇవ్వాలని అటవీ సంరక్షణ నియమాలు 2022ను రద్దు చేయాలని ఏఐకేఎంఎస్ ఆధ్వర్యంలో భీమిని తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించి తహసీల్దార్ లక్ష్మీరాజయ్యకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఏఐకేఎంఎస్ రాష్ట్ర సహాయ కార్యదర్శి లాల్‌కుమార్ మాట్లాడుతూ పోడు భూమి సాగుదారులకు హక్కు పత్రాలిచ్చేలా అసెంబ్లీలో తీర్మానం చేయాలన్నారు. గిరిజనులకు, ఆదివాసీలకు, గిరిజనేతరులకు సర్వే పేరుతో కాలయాపన చేస్తున్నారని, షాటిలైట్ పేరుతో అనేక మంది రైతుల దరఖాస్తులు తిరస్కరించారన్నారు. ఒకే గ్రామంలో 75సంవత్సరాలు పోడు సాగు చేసుకున్నప్పటికీ పట్టాలు ఇవ్వడం లేదని పేర్కొన్నారు. పోడు సాగు చేసుకుంటున్న రైతులకు ప్రభుత్వం పట్టాలివ్వాలని డిమాండ్ చేశారు.

ఘనంగా రమాబాయి జయంతి



వాంకిడి: రమాబాయి చిత్రపటానికి పూలమాల వేస్తున్న జెడ్పీటీసీ, బౌద్ధ సంఘం నాయకులు

కౌటాల: మండల కేంద్రంలోని బుద్దవిహార్‌లో మంగళవారం రమాబాయి అంబేద్కర్ జయంతిని మహార్ సంఘం నాయకులు ఘనంగా నిర్వహించారు. ఎంపీపీ బసర్కార్ విశ్వనాథ్, నాయకులు రమాబాయి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమాల్లో అంబేద్కర్ సంఘం మండల అధ్యక్షుడు దాగం పత్రు, బీజేపీ పార్టీ మండల అధ్యక్షుడు నారులే వాసుపటేల్, కార్యదర్శి కవిరాజ్, పార్టీ నాయకులు ప్రకాశ్, బిక్కజీ, వసంత్, మధుకర్, వాసుదేవ్, సుధాకర్, అశోక్, సంఘం కమిటీ సభ్యులు దుర్గం జీవన్‌దాస్, కాశీనాథ్, శంకర్, కిశోర్, నాందేవ్, ప్రకాశ్ తదితరులు పాల్గొన్నారు.

వాంకిడిలో..

వాంకిడి: మహిళలు రమాబాయిని ఆదర్శంగా తీసుకుని, తమ పిల్లలను ఉన్నతంగా తీర్చిదిద్దాలని జెడ్పీటీసీ అజయ్‌కుమార్ అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని జెత్తవాన్ బుద్ధ విహార్ ఆవరణలో రమాబాయి 125వ జయంతిని బౌద్ధ మహాసభ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. రమాబాయి చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. కార్యక్రమంలో సర్పంచ్ బండె తుకారాం, బౌద్ధ మహాసభ జిల్లా అధ్యక్షుడు అశోక్ మహోల్కర్, మండల అధ్యక్షుడు జైరాం ఉప్రే, మార్కెట్ కమిటీ డైరెక్టర్ రోషన్ ఉప్రె, నాయకులు రాజేశ్వర్, అరుణ్, బలవంత్ రావు, దీపు, పాండు, దేవాజీ తదితరులు పాల్గొన్నారు.

సిర్పూర్ (టి)లో..

సిర్పూర్(టి): మండల కేంద్రంలోని అంబేద్కర్ భవన్‌లో మంగళవారం బౌద్ధ మహాసంఘం, అంబేద్కర్ సంఘాల ఆధ్వర్యంలో రమాబాయి అంబేద్కర్ 125వ జయంతిని ఘనంగా నిర్వహించారు. రమాబాయి అంబేద్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో బౌద్ధ మహా సంఘం మండల అధ్యక్షుడు నగ్రాడె రాజు, ప్రధాన కార్యదర్శి దుర్గం తిరుపతి, గ్రామ కమిటీ అధ్యక్షుడు టి. దేవిదాసు, సంఘం నాయకులు గణేష్, సంజయ్, రమాబాయి, లలిత, మౌల్కర్ హేమలత, నగ్రాడె స్వాతి తదితరులు పాల్గొన్నారు.

ఖమానలో..

వాంకిడి: మండలంలోని ఖమాన గ్రామంలో రమాబాయి 125వ జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక నాగ్‌సేన్ బుద్ధ విహార్‌లో బుద్ధ పూజ చేసి నివాళులర్పించారు. వేడుకల్లో భాగంగా సాయంత్రం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో నాగ్‌సేన్ బుద్దిస్ట్ యువజన సంఘం నాయకులు, అంబేద్కర్ సంఘం నాయకులు, రమాబాయి మహిళా మండలి నాయకులు, గ్రామస్తులు పాల్గొన్నారు.



కౌటాల: నివాళులర్పిస్తున్న బీజేపీ నేతలు



సిర్పూర్(టి): నివాళులర్పిస్తున్న నాయకులు



నాగ్‌సేన్ బుద్ధ విహార్‌లో పూజ చేస్తున్న బౌద్ధులు

ఒకే ఈతలో రెండు దూడలు



ఆవు, దూడలతో రైతు

కౌటాల: మండలంలోని గోవర్‌హెట్టి గ్రామానికి చెందిన రౌత్ సుధాకర్‌కు చెందిన ఆవు మంగళవారం ఒకే ఈతలో రెండు మగ దూడలకు జన్మనిచ్చింది. ఆవు, రెండు దూడలు ఆరోగ్యంగా ఉన్నట్లు రైతు తెలిపాడు.

నేడు బీజేపీ కార్యవర్గ సమావేశం

రెబ్బెన: మండల కేంద్రంలోని అన్నపూర్ణ హైస్కూల్‌లో బుధవారం ఉదయం 10.30 గంటలకు బీజేపీ మండల కార్యవర్గ సమావేశాన్ని నిర్వహిస్తున్నట్లు మండల అధ్యక్షుడు గోలెం తిరుపతి తెలిపారు. సమావేశానికి మండలంలోని గ్రామాల బూత్ అధ్యక్షులు, బూత్ స్థాయి, మండల, జిల్లా నాయకులు, కార్యకర్తలు హాజరుకావాలని కోరారు.

ముగిసిన క్రికెట్ పోటీలు



బహుమతులు అందజేస్తున్న నాయకులు

కౌటాల: క్రీడల్లో గెలుపోటములు సహజమని సర్పంచ్ ఆదే శ్రీనివాస్ అన్నారు. మండలంలోని ముత్తంపేట గ్రామంలో కొనసాగుతున్న క్రికెట్ పోటీలు మంగళవారం ముగిశాయి. పోటీల్లో గెలుపొందిన సిర్పూర్(టి) జట్టుకు రూ. 21వేలు, రన్నరప్‌గా నిలిచిన ముత్తంపేట జట్టుకు రూ.11వేలు నగదు ప్రదానం చేశారు. ఉప సర్పంచ్ దుర్గం వెంకటేశ్, బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు ఆదే వసంత్ రావ్, నాయకులు దోని అంజయ్య, ఆదే నాందేవ్, విఠల్, మోర్లె వేణు, రవితేజ, లోహిత్, మహేష్, తదితరులు పాల్గొన్నారు.

'చలో హైదరాబాద్' పోస్టర్ ఆవిష్కరణ

సిర్పూర్(టి): ఈనెల 15న హైదరాబాద్‌లో నిర్వహించనున్న ఆరె కుల ఆత్మగౌరవ భవన నిర్మాణ భూమిపూజ కార్యక్రమ పోస్టర్‌ను మంగళవారం ఆరెకుల సంఘం నాయకులు స్థానిక ఆర్అండ్‌బీ అతిథి గృహంలో ఆవిష్కరించారు. వారు మాట్లాడుతూ చలో హైదరాబాద్ కార్యక్రమంలో కుల సంఘం నాయకులు, కుల బాంధవులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో ఆరెకుల సంఘం జిల్లా అధ్యక్షుడు బొట్టుపల్లి జైరామ్, జిల్లా ఉపాధ్యక్షుడు కొలె బిక్కాజి, మండల అధ్యక్షుడు చన్కపురె శంకర్, గౌరవ అధ్యక్షుడు ఎల్ములే శంకర్, ఉపాధ్యక్షుడు శ్యాంరావ్, సంఘం నాయకులు దివాకర్, నందాజి, రవీందర్, రమేష్, బాబాజి తదితరులు పాల్గొన్నారు.



పోస్టర్ ఆవిష్కరిస్తున్న ఆరె సంఘం నాయకులు

పంటల పరిశీలన

కౌటాల: మండలంలోని విజయనగరం గ్రామానికి చెందిన రైతుల రవి– సునంద సీపీఆర్ పద్ధతిలో పంటలు సాగు చేస్తున్న క్షేత్రాన్ని కౌటాల మయూరి ప్రైవేట్ విద్యాలయం విద్యార్థులు మంగళవారం పరిశీలించారు. విద్యార్థులు పంటల సాగు వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఆర్గానిక్ పద్ధతిలో పంటలు సాగు చేయాలని, సేంద్రియ ఎరువులతో సాగు చేసే కూరగాయలు తింటేనే ప్రజలు ఆరోగ్యంగా ఉంటారని రైతులు వివరించారు. కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ యాదగిరి, హెచ్ఎం కృష్ణ, తదితరులు పాల్గొన్నారు.



పంటలు పరిశీలిస్తున్న విద్యార్థులు